## క్లుప్తంగా

### స్వచ్ఛమైన నీటితో ఆరోగ్యం

చిప్పగిరి: స్వచ్ఛమైన నీరు తాగడం ద్వారా ఆరోగ్యంగా ఉంటారని ఎంపీడీఓ అల్లాబకాష్ అన్నారు. సోమవారం ఆర్‌డబ్ల్యుఎస్ ఆధ్వర్యంలో స్థానిక జెడ్పీహెచ్ హైస్కూల్‌లో జల్‌జీవన్ మిషన్‌పై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

### విద్యార్థులకు కంటి పరీక్షలు

ఆస్పరి: స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్లో సోమవారం ఇండియా విజన్ ఇన్‌స్టిట్యూట్ ఆధ్వర్యంలో కంటి వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరంలో 300 విద్యార్థులకు కంటి పరీక్షలు చేయగా ఇందులో 20 మందికి దృష్టిలోపం ఉన్నందున ఉచితంగా కళ్ల అద్దాలు ఇస్తామని ప్రోగ్రాం ఆఫీసర్ షేక్ సాధిక్, కోఆర్డినేటర్ నిరంజన్ గౌడ్ తెలిపారు.

### రోడ్ల పరిశీలన



రోడ్లు పరిశీలిస్తున్న అధికారులు

మద్దికెర : మండలంలో ఉపాధి నిధులతో చేపడుతున్న సీసీ రోడ్లను పంచాయతీరాజ్ ఈఈ మద్దన్న, డీఈ శేషయ్య సోమవారం పరిశీలించారు. సాయినగర్‌లో రోడ్లు సరిగా వేయడం లేదని కాలనీవాసులు అధికారుల దృష్టికి తీసుకెళ్లారు.

### జాబ్‌మేళాలో 15మందికి ఉద్యోగాలు

పత్తికొండ(తుగ్గలి : రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సోమవారం జాబ్ మేళా నిర్వహించారు. మొత్తం 48 మంది నిరుద్యోగులు హాజరయ్యారు. శ్రీరామ్ చిట్స్, ఇన్సూరెన్స్‌లో కంపెనీకి 12 మంది, ఎస్‌బీఐ లైఫ్ ఇన్సూరెన్స్ కంపెనీలో ఉద్యోగాలకు ముగ్గురు అర్హత సాధించినట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ మాధురి, నైపుణ్యాభివృద్ధి సంస్థ జిల్లా అధికారి ఆనంద్‌రాజ్‌కుమార్ తెలిపారు.

### డిగ్రీ కళాశాల ఏర్పాటుకు స్థల పరిశీలన

కృష్ణగిరి: మండలంలోని కంబాలపాడు గ్రామ శివారులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల సమీపంలో డిగ్రీ కళాశాల ఏర్పాటుకు స్థలాన్ని సోమవారం అధికారులు పరిశీలించారు. జోన్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.భారతి, వైస్ ప్రిన్సిపాల్ వీరాచారి, కామర్స్ లెక్చరర్ వెంకటకృష్ణయ్య పలు స్థలాలను పరిశీలించారు. మంగళవారం మరోమారు ఆర్జేడీ ఆధ్వర్యంలో పరిశీలిస్తామని వారు తెలిపారు.

### ఘనంగా కనకదాసు జయంతి



కనకదాసు చిత్రపటాన్ని ఊరేగిస్తున్న మొలగవల్లి గ్రామ కురువ కులస్తులు

ఆలూరు రూరల్: భక్త కనకదాసు జయంతి వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. మండలంలోని మొలగవల్లి గ్రామంలో కనకదాసు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి ఊరేగించారు. కురుబ కులస్తులు హనుమప్ప, మారెప్ప,ఈరన్న,శ్రీరాములు, లక్ష్మిరెడ్డి, మాణిక్యరెడ్డి పాల్గొన్నారు.

హొళగుంద: మండలంలో సోమవారం కురువల ఆరాధ్య దైవం భక్త కనకదాసు 537వ జయంతి వేడుకలు కురవ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. హొళగుంద, కోగిలతోట, హెబ్బటం, ఎల్లార్తి, పెద్దహ్యాట, గజ్జహళ్లీ, లింగంపల్లి, మార్లమడికి, నెరణికి తదితర గ్రామాల్లో కనకదాసు చిత్రపటాన్ని ఊరేగించారు. కోగిలతోటలో జెడ్పీ వైస్ చైర్మన్ కురువ బుజ్జమ్మ, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. నెరణికిలో జరిగిన కార్యక్రమంలో బళ్లారి మాజీ డిప్యూటీ మేయర్ శశికళ, ఆమె భర్త కృష్ణమోహన్ పాల్గొన్నారు.

ఆస్పరి: హలిగేర గ్రామంలో సోమవారం భక్త కనకదాసు జయంతి వేడుకలు కురబ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. ఈసందర్భంగా భక్త కనకదాసు చిత్ర పటానికి పూలమాలలు వేసి పూజలు చేశారు. ఎద్దుల బండిపై భక్త కనకదాసు చిత్ర పటాన్ని ఊరేగించారు.

### వేదావతి నదిపై ప్రాజెక్టు నిర్మించాలి



మాట్లాడుతున్న ప్రభాకర్‌రెడ్డి

ఆలూరు: ఆలూరు నియోజకవర్గం రైతున్నల కోరిక మేరకు హాలహర్వి మండలం గూళ్యం గ్రామ వద్ద నిర్మంచ తలపెట్టిన వేదావతి నదిపై మినీ హైడ్రాలిక్ ప్రాజెక్టు నిర్మాణం పనులకు కూటమి ప్రభుత్వం ప్రత్యేక బడ్జెట్ కేటాయించి నిర్మించాలని ప్రజాసంఘాల నాయకులు స్థానిక జ్యోతి బసు భవన్‌లో సోమవారం రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు.

### వైభవంగా కార్తీక దీపోత్సవం



మద్దికెర: దీపాలు వెలిగిస్తున్న మహిళలు

మద్దికెర : కార్తీక సోమవారం సందర్భంగా భక్తులు శివాలయాలలో దీపాలు వెలిగించారు. మండలంలోని పెరవలి, మద్దికెర, బుగ్గలోని సంగమేశ్వరాలయంలోఉత్సవమూర్తులను ఆలయ ప్రదక్షిణలు చేయించారు.

హొళగుంద: స్థానిక శ్రీసిద్ధేశ్వరస్వామి ఆలయ ఆవరణలో కార్తీక సోమవారం సందర్భంగా దీపోత్సవ కార్యక్రమం వైభవంగ జరిగింది. కార్యక్రమాన్ని శంభులింగ శివాచార్య మహాస్వాములు ప్రారంభించారు.



మరమ్మతులకు గురైన ఎస్సీ బాలికల గృహంలోని ఆర్వో ప్లాంట్



హొళగుంద మండలం ఇంగళదహాల్‌లో శిథిలావస్థకు చేరిన బీసీ వసతి గృహం



కంబాలపాడు బీసీ హాస్టల్‌లో వసతి చాలక డైనింగ్ హాల్‌లో ఇలా..



ఫైబర్ షీట్స్ కాలిపోవడంతో మిగిలిన పైపులు



కంబాలపాడు ఎస్సీ హాస్టల్ గదుల్లో లోపలి భాగం పూర్తిగా పెచ్చులూడుతున్న దృశ్యం

# సంక్షేమ హాస్టళ్లలో సమస్యల తిష్ట

వారంతా పేద,మధ్య తరగతి కుటుంబాల పిల్లలు, కార్పొరేట్ స్కూళ్లలో ఫీజులు కట్టలేని పరిస్థితిలో ప్రభుత్వ వసతి గృహాల్లో చేరారు. బంగారు భవిష్యత్ కోసం కలలుగంటూ విద్యాభ్యాసం చేస్తున్నారు. వసతుల లేమి ఉన్నా హాస్టళ్లలోనే రోజులు వెళ్లదీస్తూ చదువుకుంటున్న విద్యార్థులకు అండగా నిలవాల్సిన పాలకులు, అధికారులు చోద్యం చూస్తున్నారు. హాస్టళ్లలో మెరుగైన వసతులు కల్పించడంతో పాటు నాణ్యమైన భోజనం అందించి తమ పిల్లలకు విద్యాబుద్ధులు నేర్పాలని తల్లిదండ్రులు చేస్తున్న విజ్ఞప్తిని సర్కారు ఆలకించడం లేదు. సంక్షేమ హాస్టళ్లలో అరకొర వసతుల మధ్యనే పేదింటి విద్యార్థులు చదువులు కొనసాగిస్తున్నారు.



ఈ చిత్రంలో కనిపిస్తున్న ఎస్సీ బాలికల సంక్షేమ వసతి గృహం ఆలూరులోనిది. దీన్ని 1971లో ప్రారంభించారు. ఇందులో 200 మంది విద్యార్థినులు ఉంటున్నారు. 10 గదులు మాత్రమే ఉన్నాయి. వాటిలో ఒక గది స్టోర్ రూం కోసం ఉపయోగిస్తున్నారు. భవనం నిర్మించి 53 ఏళ్లు పూర్తికావడంతో శిథిలావస్థకు చేరింది. డైనింగ్ హాల్ పెచ్చులూడిపడుతుండటంతో గదుల్లోనే భోజనం చేస్తున్నారు. వంటశాల శిథిలావస్థకు చేరడంతో వంట చేయడం ఇబ్బందిగా మారింది. ఆర్వో ప్లాంట్ మరమ్మతులకు గురవడంతో తాగునీటి కోసం అవస్థలు పడుతున్నారు. డ్రైనేజీ వ్యవస్థ సరిగా లేకపోవడంతో హాస్టల్ ఆవరణలోనే మరుగునీరు నిలిచిపోతోంది. స్కావెంజర్ లేకపోవడంతో మరుగుదొడ్లు అధ్వానంగా మారాయి. 167 హైవేకు అనుకొని ఉండటం వల్ల ప్రహరీ ఎత్తు పెంచకపోవడంతో బాలికలు ఇబ్బంది పడుతున్నారు.

- సంక్షేమ హాస్టళ్లలో కొరవడిన వసతులు
- మరుగుదొడ్లు, మంచినీరు లేక విద్యార్థుల అవస్థలు
- రాత్రి వేళ్లలో ఆరుబయటకు వెళ్లడానికి జంకుతున్న బాలలు
- వేధిస్తున్న గదులు, సిబ్బంది కొరత
- డ్రైనేజీ పారక దోమలకు ఆవాసంగా పరిసరాలు
- మైదానంలోనే భోజనాలు
- శిథిలావస్థలో వసతి కేంద్రాల భవనాలు
- అరకొర సౌకర్యాల మధ్య చదువుల బండిని లాగుతున్న పేదింటి పిల్లలు
- ఆలూరు నియోజకవర్గంలో 12 సంక్షేమ హాస్టళ్లు, ఒక గురుకులం, 2,934 మంది విద్యార్థులు





డ్రైనేజీ వ్యవస్థ లేక ఆలూరు ఎస్సీ బాలికల వసతి గృహం ఆవరణలో నిలిచిన మురుగు నీరు, తుగ్గలి కేజీబీవీలో పిచ్చిమొక్కలు మధ్య మరుగుదొడ్డి

ఆలూరు రూరల్: ప్రభుత్వం నిర్లక్ష్యంతో సంక్షేమ హాస్టళ్లు సమస్యలకు నిలయాలుగా మారాయి. గదుల కొరత, తాగునీరు, విద్యుత్ లైట్లు, ఫ్యాన్లు, ప్రహరీ, డ్రైనేజీ వ్యవస్థ లేక విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు. ఆలూరు నియోజకవర్గంలో బీసీ,ఎస్సీ,ఎస్టీ సంక్షేమ గృహాలు 6 ఉండగా, ఒక అంబేద్కర్ గురుకులం పాఠశాల, 6 కేజీబీవీ పాఠశాలలు, రెండు మోడల్ స్కూల్ హాస్టళ్లు ఉన్నాయి. సోమవార సాక్షి విజిట్‌లో పలు సమస్యలు వెలుగు చూశాయి.

- ఆలూరులోని స్థానిక గిరిజన సంక్షేమ బాలికల పాఠశాలలో 3 నుంచి 10వ తరగతి విద్యార్థులు 294 మంది చదువుతున్నారు.
- సొంత భవనం లేక బాలుర గిరిజన వసతి గృహంలోని ఒక భాగంలో పాఠశాల నడుతున్నారు.
- ఏడుగురు పీజీటీలు ఉండాల్సి ఉండగా ఒక్కరూ లేరు. ఆరుగురు టీజీటీలే 8 క్లాసులు బోధిస్తున్నారు.
- ఎల్లార్తి రోడ్డులోని సమీకృత బాలుర వసతి గృహంలో 400 మందికి పైగా విద్యార్థులు ఉన్నారు. గదులు శిథిలావస్థకు చేరాయి.
- ఆర్వో ప్లాంట్ పనిచేయడం లేక విద్యార్థులు బోరు నీరు తాగుతున్నారు.
- ఫ్యాన్లు లేక పోవడంతో రాత్రి పూట నిద్రించడానికి ఇబ్బంది పడుతున్నారు.
- ప్రహరీ లేక పందులకు ఆవాసంగా మారింది.
- డ్రైనేజీ వ్యవస్థ లేక హాస్టల్ చుట్టూ మురుగు నీరు చేరి దుర్వాసన వెదజల్లుతోంది.
- ఆలూరులోని గిరిజన బాలుర పాఠశాలలో 460 మంది విద్యార్థులున్నారు. గదుల కొరత, తాగునీటి సౌకర్యం లేక ఇబ్బంది పడుతున్నారు.
- గత ఏడాది హాలహర్వి మండలంలోని కొక్కరచేడు గ్రామ బీసీ బాలుర హాస్టల్‌ను ఆలూరుకు మండల కేంద్రానికి మార్చారు. ఇందులో 150 మంది విద్యార్థులు ఉంటున్నారు. అద్దె భవనంలో నిర్వహిస్తున్నారు.
- అరికెర అంబేద్కర్ గురుకులం పాఠశాల 1983లో నిర్మించారు. ఇందులో 540 విద్యార్థులు చదువుతున్నారు.
- తాగునీటి ట్యాంక్ శిథిలావస్థకు చేరడంతో నీటి సరఫరా ఇబ్బందిగా మారింది. ప్రహరీ శిథిలమైంది.
- హొళగుంద మండలంలోని ఇంగళదహాల్ గ్రామ బీసీ హాస్టల్‌లో 13 గదులు ఉండగా 10 గదులు శిథిలావస్థకు చేరడంతో 3 గదుల్లోనే 136 మంది విద్యార్థులు ఉంటున్నారు. బాత్రూం, లెట్రిన్ ఉన్నా పనిచేయకపోవడంతో విద్యార్థులు ఆరుబయటకు వెళ్లాల్సిన పరిస్థితి.
- ఆస్పరిలోని ఎస్సీ బాలికల హాస్టల్‌లో 60 మంది విద్యార్థినులు ఉన్నారు. ఇక్కడ మంచినీటి సమస్య తీవ్రంగా ఉంది.
- హాస్టల్ చుట్టూ కంప చెట్లు పెరిగిపోవడంతో విషపురుగులు సంచరిస్తున్నాయి.
- ఆస్పరిలోని ఎస్సీ బాలుర హాస్టల్‌లో 48 మంది విద్యార్థులు ఉన్నారు. మరుగుదొడ్లు ఉన్నా పనిచేయకపోవడంతో ఆరుబయట వెళ్తున్నారు. స్నానపు గదులు లేక ఆరు బయట స్నానం చేస్తున్నారు.
- దేవనకొండ మండలంలోని తెర్నేకల్ గ్రామంలో ఒక బీసీ బాలికల, ఒక బాలుర బీసీ హాస్టల్ ఉంది. బాలికల హాస్టల్‌లో 350 మంది విద్యార్థినులు ఉన్నారు. సరైన బాత్రూం సౌకర్యం లేకపోవడంతో ఇబ్బంది పడుతున్నారు. గదులు,తాగునీటి సమస్యతో ఇబ్బంది పడుతున్నారు. సీసీ కెమెరాలు ఏర్పాటు చేయలేదు.

### కృష్ణగిరి, వెల్దుర్తి మండలాల్లోని హాస్టళ్లు, విద్యార్థుల వివరాలు

కృష్ణగిరి మండలంలో ఎరుకలచెరువులోని ఎస్సీ హాస్టల్‌లో 50 మంది బాలురు, కంబాలపాడులోని బీసీ హాస్టల్‌లో 530 మంది బాలురు, ఎస్సీ హాస్టల్ 130 మంది బాలురు ఉన్నారు. కంబాలపాడులోని డా.బీఆర్ అంబేద్కర్ బాలికల గురుకుల పాఠశాలలో 739 మంది, కృష్ణగిరిలోని కస్తూర్బా విద్యాలయంలో 264 మంది, మోడల్‌స్కూల్‌లో బాలికల హాస్టల్‌లో 100 మందితో కలిసి 1,813 విద్యార్థులు ఉన్నారు. అలాగే వెల్దుర్తి మండలంలోని వెల్దుర్తిలోని బాలికల ఎస్సీ హాస్టల్‌లో 145, బాలికల హాస్టల్‌లో 590 మంది, కస్తూర్బా విద్యాలయంలో 260, డా.బీఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాలలో 630 మంది, జ్యోతిరావుపూలే బాలికల పాఠశాలలో 480 మందితో కలిపి 2,105 మంది విద్యార్థులు ఉన్నారు.

### అధ్వానంగా సదుపాయాలు..

కొన్ని హాస్టళ్లలో పేరుకే మెనూ. ఇష్టానుసారంగా అన్నం వండి వడ్డిస్తున్నారు. బాత్ రూములు, టాయ్‌లెట్లకు డోర్లు లేక నీటి సరఫరా లేక ఇబ్బంది పడుతున్నారు. కాస్మోటిక్ చార్జీలు మంజూరు చేయలేదు. ట్రంకు పెట్టెలు, ప్లేట్లు సరఫరా చేయడం లేదు. ఒక్కో విద్యార్థికి రోజుకు రూ.80 వరకు ఖర్చు వస్తే..ప్రభుత్వం రూ.45 మాత్రమే ఇస్తోందని ఆయా హాస్టళ్ల వార్డన్లు వాపోతున్నారు. దీంతో హాస్టళ్ల నిర్వహణ ఇబ్బందిగా మారింది. ఔట్ సోర్సింగ్ ,రెగ్యూలర్, కాంట్రాక్ట్, నాన్ టీచింగ్ ఉద్యోగులకు గత 6 నెలల నుంచి జీతాలు లేవు. బాలికల వసతి గృహాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాల్సి ఉండగా ఎక్కడా కనిపించడం లేదు.

### పర్యవేక్షణ శూన్యం

నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో ఉన్న సంక్షేమ వసతి గృహాలపై అధికారుల పర్యవేక్షణ కరువైంది. ఇటీవల ఒక్కో శాఖ మండల అధికారికి వారంలో రెండు సార్లు పర్యవేక్షణ బాధ్యతలు అప్పగించినా..అమలు కావడం లేదు. వారంలో ఏదో ఒక రోజు మొక్కుబడిగా హాస్టళ్లకు వెళ్తున్నారు. ఇక్కడ నెలకొన్న సమస్యలు పరిష్కరించేందుకు ఉన్నతాధికారులకు నివేదికలు పంపించడం లేదనే విమర్శలున్నాయి.

**తుగ్గలి :**

- తుగ్గలి మండలంలో జొన్నగిరి, పెండేకల్లు రైల్వే జంక్షన్‌లో ఎస్సీ హాస్టళ్లు, రాతన వద్ద గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాల, ఏపీటీడబ్ల్యూఆర్ ఉన్నాయి.
- పెండేకల్లు రైల్వే జంక్షన్‌లో కొన్నేళ్ల నుంచి ఉన్న ఎస్సీ హాస్టల్‌ను 2016లో అప్పటి టీడీపీ ప్రభుత్వం మూసేసింది. హాస్టల్ మూసివేతతో చుట్టుపక్కల గ్రామాల విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. పేద విద్యార్థుల విద్యాభివృద్ధి కోసం తిరిగి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో హాస్టల్ పునఃప్రారంభమైంది. పాత హాస్టల్ భవనం శిథిలావస్థకు చేరడంతో అద్దె బిల్డింగ్‌లో నిర్వహిస్తున్నారు. దీంతో విద్యార్థులు కాలకృత్యాలకు ఆరుబయటకు వెళ్లాల్సి వస్తోంది. బాత్‌రూంలు లేక కుళాయి కింద స్నానాలు చేస్తున్నారు.
- తుగ్గలి కేజీబీవీ కాంపౌండ్‌లో పిచ్చి మొక్కలు పెరిగి మరుగుదొడ్డికి వెళ్లేందుకు ఇబ్బందులు తలెత్తాయి. దీంతో పాఠశాల లోపల ఉన్నవాటితోనే సర్దుకుపోవాల్సి వస్తోంది. ప్రహరీ పడిపోవడంతో రాత్రిళ్లు భయం భయంగా విద్యనభ్యసిస్తున్నారు.
- పత్తికొండ సమీకృత వసతి భవనంలో 3- 10వ తరగతి చదివే విద్యార్థులు 350 మంది ఉన్నారు. హాస్టల్‌లో తగినంత సిబ్బంది లేరు. ముగ్గురు వార్డన్లు, ముగ్గురు కుక్‌లకు గాను ఒక్కొక్కరే ఉండగా, ముగ్గురు కమాటీలకు గాను ఇద్దరు ఉన్నారు. ముగ్గురు వాచ్‌మెన్లు ఉండాల్సి చోట ఒక్కరూ లేక రాత్రిళ్లు ఇబ్బందిగా మారింది. ఉన్న ఒక వార్డన్‌పై పనిభారం పడుతోంది. ఇక జూలై నుంచి మెస్ చార్జీలు విడుదల కాలేదు. విద్యార్థులకు కాస్మోటిక్ చార్జీలు ఇవ్వలేదు. ఒక బెడ్ షీట్ ఇచ్చి ప్రభుత్వం చేతులు దులుపుకుంది.

మద్దికెర : స్థానిక బీసీ బాలుర సంక్షేమ బీసీ వసతి గృహంలో విద్యార్థులు సమస్యల నడుమ చదువులు కొనసాగిస్తున్నారు. విద్యార్థులు చదువుకోడానికి, భోజనం చేయడానికి హాస్టల్‌పై భాగంలో గతంలో దాతలు ఫైబర్ షీట్స్‌తో షెడ్ ఏర్పాటు చేసి నీడ కల్పించారు. హాస్టల్‌కు భద్రత లేకపోవడంతో ఆకతాయిలు నిప్పు పెట్టడంతో షీట్స్ కాలిపోయాయి. అప్పటి నుంచి వాన వచ్చినా, ఎండ పడినా గదుల్లోకి పారిపోవాల్సిందే. లోపలికి ఎవరూ రాకుండా గ్రిల్స్ ఏర్పాటు చేయాలని అడిగినా పట్టించుకోలేదు. మండలంలోని మోడల్ స్కూల్ హాస్టల్‌లో వంద మంది, కస్తూర్బా హాస్టల్‌లో 240 మంది, బీసీ బాలుర సంక్షేమ బీసీ వసతి గృహంలో 180 మంది విద్యార్థులు వసతి పొందుతున్నారు.

కృష్ణగిరి: మండలంలో మూడు సంక్షేమ హాస్టళ్లు ఉన్నాయి. కంబాలపాడులో బీసీ, ఎస్సీ హాస్టళ్లు ఉండగా ఎరుకల చెరువులో ఎస్సీ హాస్టల్ ఉంది. కంబాలపాడులో డా.బీఆర్ అంబేద్కర్ గురుకుల బాలికల పాఠశాల ఉంది. కృష్ణగిరిలో కస్తూర్బా విద్యాలయంతో పాటు మోడల్‌స్కూల్‌లో బాలికల హాస్టల్ ఉంది. వీటిల్లో 1,800 మంది విద్యార్థినీ, విద్యార్థులు ఉంటున్నారు.

- కంబాలపాడు ఎస్సీ హాస్టల్‌ను 35ఏళ్ల క్రితం నిర్మించారు.ఇందులో 130 మంది విద్యార్థులు ఉండగా నాలుగేళ్ల నుంచి భవనాలు పెచ్చులూడి పడుతున్నాయి. ఈ యేడాది భారీ వర్షాలకు పూర్తిగా దెబ్బతినడంతో రాత్రి వేళల్లో విద్యార్థులను ఇక్కడ పండుకోకుండా బయట ఉన్న ప్రభుత్వ భవనంలో పడుకుంటున్నారు.
- తాగునీటి సమస్యతోపాటు స్వచ్ఛభారత్ కింద ఏర్పాటు చేసిన మరుగుదొడ్లు నిరూపయోగంగా ఉన్నాయి.
- బీసీ హాస్టల్ పరిమితి 300 మందికి గాకా ఇక్కడ 530 మంది విద్యార్థులు ఉన్నారు. దీంతో గదులు చాలక, డైనింగ్ హాల్‌తోపాటు వరండాల్లో టేబుళ్లపై ఉంటున్నారు. ఇక్కడ 50 దాకా మరుగుదొడ్లు నిర్మించినా ఐదారు తప్ప అన్ని నిరూపయోగంగా ఉన్నాయి. నిర్మాణంలో లోపాలు ఉండటంతో నీరు బయటకు వెళ్లకపోవడంతో బహిర్భూమికి బయటకు వెళ్తున్నారు. విద్యార్థులకు రోజూ ఆరుబయటే భోజనం చేస్తున్నారు.
- ఎరుకలచెరువు హాస్టల్‌లో కూడా తాగనీటి సమస్య అధికంగా ఉంది. విద్యార్థులు ఆర కిలోమీటర్ వెళ్లి స్నానాలు చేయాల్సిన దుస్థితి నెలకొంది.

**ఆలూరు నియోజకవర్గంలో సంక్షేమ హాస్టళ్లు, విద్యార్థుల వివరాలు**

| మండలం | సంక్షేమ హాస్టళ్లు | విద్యార్థులు |
|---|---|---|
| ఆలూరు | 7 | 2,045 |
| ఆస్పరి | 3 | 278 |
| హొళగుంద | 1 | 136 |
| దేవనకొండ | 2 | 475 |

### తాగునీటి సమస్య ఉంది



ఆర్వో ప్లాంట్ చెడిపోవడంతో మంచినీటి సమస్య తీవ్రంగా ఉంది. కుళాయి నీరు వచ్చినప్పుడు పట్టుకుని తాగుతున్నాం. వంటశాల, డైనింగ్ హాల్‌లో పెచ్చులూడి పడుతున్నాయి. దీంతో గదుల్లోనే తింటున్నాం. స్కావెంజర్లు లేక మరుగుదొడ్లు శుభ్రం చేసేవారు లేరు.

– షర్మిల, ఆలూరు ఎస్సీ హాస్టల్ విద్యార్థిని

### మరుగుదొడ్లు లేవు



హాస్టల్‌లో మరుగుదొడ్లు శిథిలమైపోయాయి. దీంతో ఆరుబయటకు వెళ్తున్నాం. నాలుగు గదులు మాత్రమే ఉన్నాయి. ఇందులోనే 136 మంది ఉంటున్నాం. ట్రంకు పెట్టెలు, ప్లేట్లు ఇవ్వ లేదు. ఇంటి నుంచే తెచ్చుకుంటున్నాం. కాస్మోటిక్ చార్జీలు అందడం లేదు. తాగునీటి సమస్య, డ్రైనేజీ సమస్యతో ఇబ్బందిగా మారింది.

– మల్లికార్జున,ఇంగళదహాల్

### హాస్టల్ శిథిలావస్థకు చేరింది



మా హాస్టల్ పూర్తిగా శిథిలావస్థకు చేరింది. దీంతో రాత్రి వేళల్లో ఉండేందుకు భయపడుతుండటంతో పక్క నే ఉన్న ప్రభుత్వం భవనంలో కొంత మంది పడుకుంటున్నాం. అలాగే మరుగుదొడ్లు నిర్మించిలా నీరు బయట కు వెళ్లదు. రాత్రి వేళల్లో ఆరుబయటకు వెళ్తున్నాం. గదులకు వాకిళ్లు, కిటికీలు పూర్తిగా పాడైపోయాయి. నూతన భవనం ఏర్పాటు చేయకపోతే ఇబ్బందులు తప్పవు.

– అనిల్‌కుమార్, పదవ తరగతి,ఎస్సీ హాస్టల్ కంబాలపాడు

### ఆరు బయటే భోజనం చేస్తున్నాం



మా హాస్టల్‌కు పోటీ ఎక్కువగా ఉండటంతో విద్యార్థుల సంఖ్య గణనీయంగా పెరిగింది. విద్యార్థులు ఎక్కువ మంది ఉండటంతో గదులు చాలక డైనింగ్ హాల్‌లో కూడా ఉంటున్నాం. దీంతో ప్రతి రోజూ భోజనం ఆరు బయట తింటున్నాం. వర్షం వచ్చిన రోజు భోజనం చేయాలంటే చాలా ఇబ్బంది పడుతున్నాం. అలాగే మరుగుదొడ్లు ఉన్నా నిరూపయోగంగా ఉండటంతో రాత్రిపూట బయటకు వెళ్తున్నాం.

– సుదర్శన్, బీసీ హాస్టల్, కంబాలపాడు

### తాగునీటి సమస్య అధికంగా ఉంది



మా హాస్టల్‌లో తాగునీటి సమస్య తీవ్రంగా ఉంది. అలాగే స్నానాలు చేయాలంటే నీళ్లు లేవు. దీంతో ఆర కిలోమీటర్ దూరంలో ఉన్న చేతిపంపు వద్దకు వెళ్లి స్నానం చేస్తున్నాం. మరుగుదొడ్లు ఉన్నా నిరూపయోగంగా మారడంతో ఆరుబయటకే పోతున్నాం.

– ఎస్. ఆంధ్రయ్య, పదవ తరగతి, ఎస్సీ హాస్టల్, ఎరుకలచెరువు

### డ్రైనేజీ వ్యవస్థ లేక ఇబ్బందిగా ఉంది



హాస్టల్‌లో డ్రైనేజీ వ్యవస్థ లేక ఇబ్బందిగా మారింది. కాంపౌండ్‌లోనే మురుగు నీరు నిలిచి దుర్వాసన వస్తోంది. రాత్రి దోమలు బెడద ఎక్కువగా ఉంటుంది. గదుల కొరత వల్ల నిద్రించేందుకు ఇబ్బందిగా మారింది. 6 నెలల నుంచి ప్రత్యేక అవసరాల కిట్లు అందించడం లేదు. దీంతో బయట షాపుల్లో కొనితెచ్చుకుంటున్నాం.

– లక్ష్మి, ఆలూరు ఎస్సీ హాస్టల్, విద్యార్థిని

## వైభవంగా ప్రతిష్ఠ మహోత్సవాలు



పూజల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి

తుగ్గలి : బోడబండ కొండలో రామలింగేశ్వరస్వామి నూతన ఆలయ ప్రతిష్ఠ మహోత్సవాలు వైభవంగా నిర్వహించారు. మూడు రోజులుగా బెల్దోణ రామనాథశాస్త్రి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉత్సవాలు సోమవారం ముగిశాయి. మాజీ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి, కేడీసీసీ మాజీ వైస్ చైర్మన్ ఎస్.రామచంద్రారెడ్డి, మాజీ ఎంపీపీ నాగరత్నమ్మ దంపతులు ఆలయాన్ని దర్శించుకుని పూజలు నిర్వహించారు.

### సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

ఆలూరు రూరల్: సైబర్ నేరాలపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని సీఐ వెంకట చలపతి సూచించారు. సోమవారం హత్తిబెళగల్ గ్రామంలో నిర్వహించిన న్యాయ విజ్ఞాన సదస్సులో మాట్లాడారు.

### సహకార సంఘం వారోత్సవాలు

దేవనకొండ: స్థానిక ప్రాథమిక సహకార సంఘం కార్యాలయంలో 71వ వారోత్సవాలను సీఈఓ రహంతుల్లా ఆధ్వర్యంలో నిర్వహించారు.

### మక్కా యాత్ర పవిత్రమైనది

పత్తికొండ(తుగ్గలి) : మక్కా యాత్ర ఎంతో పవిత్రమైనదని ముస్లిం పెద్దలు బషీర్‌అహ్మద్, అస్లాంబాషా అన్నారు. మక్కా యాత్రకు బయలుదేరుతున్న పట్టణానికి చెందిన అబ్దుల్‌రెహ్మాన్, మస్తాన్, హుసేన్‌పీరాను సోమవారం సన్మానించారు.

### ఇళ్లు నిర్మించాలి..

మద్దికెర : కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీలో భాగంగా ఇల్లు లేని నిరుపేదలకు మూడు సెంట్లు స్థలం ఇవ్వడమే గాకుండా ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షలు ఇవ్వాలని సీపీఐ మండల కార్యదర్శి నాగరాజు డిమాండు చేశారు. సోమవారం సచివాలయాలలో వినతిపత్రాలు అందజేశారు.

ఆస్పరి: నిరుపేదలకు ఇళ్లు పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ సోమవారం మండలంలోని ఆస్పరి, కైరుప్పల, బిల్లేకల్లు, ముత్తుకూరు, కారుమంచి, డీకోటకొండ, యాటకల్లు, నగరూరు సచివాలయాల వద్ద సీపీఐ ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు.

హొళగుంద: రాష్ట్ర ప్రభుత్వం గ్రామాలలో పేదలకు 3 సెంట్లు, పట్టణాల్లో 2 సెంట్ల ఇళ్ల స్థలాలను ఇవ్వాలని అలాగే ఇంటి నిర్మాణం కోసం రూ.5 లక్షలు ఇవ్వాలని సీపీఐ మండల కార్యదర్శి పెద్యాట మారెప్ప డిమాండ్ చేశారు. సోమవారం హొళగుంద-3 సచివాలయం వద్ద ధర్నా చేపట్టారు.

దేవనకొండ: పేదలందరికీ ఇంటి స్థలాలు, ఇళ్లను మంజూరు చేయాలని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి కె.మద్దిలేటిశెట్టి, సీపీఐ మండల కార్యదర్శి ఎం.నరసారావు, మండలాధ్యక్షులు సి.కృష్ణ సోమవారం డిమాండ్ చేశారు.

### రోడ్డు పనుల్లో నాణ్యత పాటించాలి

ఆలూరు: ఉపాధిహామీ పథకం నిధుల ద్వారా వేస్తున్న సీసీరోడ్లు, పనులలో నాణ్యత లేకపోతే బిల్లులను మంజూరు చేయబోమని క్వాలిటీ కంట్రోలర్ డీఈ హెచ్‌డి. ఈరన్న కాంట్రాక్టర్లును హెచ్చరించారు. సోమవారం ఆలూరులోని మత్రితాతమఠం, సిద్దేశ్వరనగర్‌కాలనీలలో సీసీ రోడ్లు పనులను పీఆర్ డీఈ ఎస్.మనోహర్‌తో కలిసి పరిశీలించారు.

## హామీలు అమలు చేయండి



పత్తికొండలో ధర్నాలో మాట్లాడుతున్న రాజాసాహెబ్

వెల్దుర్తి(కృష్ణగిరి): కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయాలని సీపీఐ మండల కార్యదర్శి టి.కృష్ణ డిమాండ్ చేశారు. సీపీఐ, ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో సోమవారం అల్లుగుండు, వెల్దుర్తి సచివాలయాల వద్ద ధర్నా చేపట్టారు. ఆయన మాట్లాడుతూ ఎన్నికల ముందు చంద్రబాబు ఇళ్ల లేని పేదలకు పట్టణాల్లో రెండు సెంట్లు, గ్రామీణ ప్రాంతాల్లో మూడు సెంట్లు ఇస్తామని హామీనిచ్చారని గుర్తు చేశారు. ప్రభుత్వం ఏర్పడి ఐదు నెలలు గడిచినా అమలుకు నోచుకోలేదన్నారు. ఇంటి నిర్మాణానికి రూ. 5 లక్షలతో పాటు ఉచితంగా ఇసుక, సిమెంట్, కడ్డీ ఇవ్వాలన్నారు. రాజు, సురేంద్రయాదవ్ పాల్గొన్నారు.

పత్తికొండ(తుగ్గలి) : ప్రజలకు ఇచ్చిన హామీల అమలులో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని సీపీఐ మండల కార్యదర్శి రాజాసాహెబ్ విమర్శించారు. ఇళ్ల స్థలాలు ఇచ్చి ఇళ్లు మంజూరు చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం పత్తికొండలో ధర్నా నిర్వహించారు. సీపీఐ కార్యాలయం నుంచి ర్యాలీగా పట్టణంలోని సచివాలయాల వరకు వెళ్లి అక్కడ ధర్నా చేపట్టారు. రైతు సంఘం నియోజకవర్గ కార్యదర్శి సురేంద్ర, జిల్లా సమితి సభ్యులు పెద్ద ఆరన్న, పట్టణ సహాయ కార్యదర్శి సుంకన్న పాల్గొన్నారు.

### పకడ్బందీగా షాపింగ్ కాంప్లెక్స్ వేలాలు

ఆలూరు రూరల్: ఆలూరు మేజర్ గ్రామ పంచాయతీ పరిధిలోని సంత మార్కెట్‌లోనున్న షాపింగ్ కాంప్లెక్స్‌లో ఉన్న 27 దుకాణాలను ఈ నెల 21వ తేదీన నిర్వహిస్తామని పత్తికొండ డీఎల్‌పీఓ వీరభద్రప్ప అన్నారు. సోమవారం స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయంలో షాపింగ్ కాంప్లెక్స్‌లను రిజర్వేషన్ల వారీగా సర్పంచ్ అరుణాదేవి సమక్షంలో లాటరీ పద్ధతిన కేటాయించారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు 8 షాపులు బీసీలకు, 4 ఎస్సీలకు, 2 ఎస్టీలకు కేటాయించారు.

### ఆరు గ్యారెంటీలు అమలు చేయాలి



వైకుంఠం శ్రీరాములు సమాధి వద్ద నివాళులర్పిస్తున్న వైకుంఠం మల్లికార్జున

చిప్పగిరి: కూటమి ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారెంటీలను వెంటనే అమలు చేయాలని వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు వైకుంఠం మల్లికార్జున చౌదరి డిమాండ్ చేశారు. సోమవారం మండల కేంద్రంలో తన తండ్రి కేడీసీసీ బ్యాంకు మాజీ చైర్మన్ వైకుంఠం శ్రీరాములు,శకుంతలమ్మ దంపతుల 16 వర్ధంతి నిర్వహించారు. వారి సమాధుల వద్ద నివాళులర్పించారు.